# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | మంగళవారం - 08 - సెప్టెంబర్ - 2026 | సంపుటి : 4 | సంచిక : 96 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# అసెంబ్లీ గేటు వద్ద ఉద్రిక్తత

- బీఆర్ఎస్ నేతలతో పోలీసుల తోపులాట
- బ్లాక్ టీషర్టులతో వచ్చిన సభ్యులను అడ్డుకున్న పోలీసులు
- తోపులాటలో కిందపడ్డ హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి
- కేటీఆర్‌కు గాయాలు.. మహిళా ఎమ్మెల్యేల ఆవేదన
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీస్ స్టేషన్‌కు తరలింపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 7, (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలి రోజే ప్రధాన ద్వారం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై నిరసన వ్యక్తం చేస్తూ బ్లాక్ టీషర్టులు ధరించి అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద భారీగా మోహరించిన పోలీసులు నల్ల టీషర్టులు ధరించిన సభ్యులను లోనికి అనుమతించబోమని స్పష్టం చేయడంతో బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా సమస్యలను ప్రస్తావించేందుకు వస్తున్న తమను అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధమని వాదిస్తూ గేటు వద్దే ఆందోళనకు దిగారు.పోలీసుల అడ్డంకులను వ్యతిరేకిస్తూ మాజీ మంత్రి హరీశ్‌రావు తన టీషర్ట్‌ను అక్కడికక్కడే తొలగించి సభలోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. అయినప్పటికీ పోలీసులు ముందుకు కదలనివ్వకపోవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ గేటు దాటేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో తోపులాట పరిస్థితి ఏర్పడి కొంతసేపు గందరగోళ వాతావరణం నెలకొంది. అసెంబ్లీ ప్రధాన ద్వారం పరిసరాలు నినాదాలతో మార్మోగిపోయాయి.




ఈ తోపులాటలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి కిందపడిపోయారు. వారిని సహచర సభ్యులు పైకి లేపగా అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా తోపులాటలో చిక్కుకుని ముఖం, చేతికి గాయాలైనట్లు పార్టీ నేతలు తెలిపారు. జగదీశ్‌రెడ్డికి కూడా స్వల్ప గాయాలయ్యాయని పేర్కొన్నారు. గాయపడిన నేతలకు అక్కడే ప్రాథమిక చికిత్స అందించినట్లు సమాచారం. పోలీసుల చర్యల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

మిగతా 2లో..

# స్పీకర్ అవమానంపై సీఎం ఆగ్రహం



- సభ్యుడిని డిస్మిస్ చేయాలని రేవంత్ డిమాండ్
- చట్టసభల గౌరవాన్ని కాపాడాలన్న సీఎం
- స్పీకర్‌పై వ్యాఖ్యలు పథకం ప్రకారమేనని ఆరోపణ
- కేసీఆర్ బాధ్యత వహించాలని స్పష్టం

**హైదరాబాద్, సెప్టెంబర్ 7, (తెలంగాణ ముచ్చట్లు):**

అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వతంత్ర భారత చరిత్రలో సభాపతి పదవికి ఇంతటి అవమానం గతంలో ఎప్పుడూ జరగలేదని వ్యాఖ్యానించారు. చట్టసభల గౌరవాన్ని కాపాడాలంటే ఇలాంటి ఘటనలను తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సభలో ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చ నిర్వహించగా సీఎం తన అభిప్రాయాలను వెల్లడించారు. తాను అనేక శాసనసభల కార్యకలాపాలను పరిశీలించానని, కానీ ఇంత అభ్యంతరకరమైన భాషను సభాపతిపై ఉపయోగించడం ఎప్పుడూ చూడలేదని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ పదవికి ప్రత్యేక గౌరవం ఉంటుందని, ఆ పదవిని అవమానించే చర్యలు సహించరానివని స్పష్టం చేశారు.

మిగతా 2లో..

# తన వ్యాఖ్యలపై తాతా మధు వివరణ

- స్పీకర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం
- కాంగ్రెస్ కావాలనే దుష్ప్రచారం చేస్తోందని ఆరోపణ
- పోలీసుల తీరుపైనే ఆగ్రహం వ్యక్తం చేశానన్న ఎమ్మెల్సీ
- అసెంబ్లీ ప్రాంగణంలో రాజకీయ వేడి కొనసాగింపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 7, (తెలంగాణ ముచ్చట్లు):**

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుపై కాంగ్రెస్ నేతలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్‌కు చెందిన దళిత ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. స్పీకర్ పదవిని అవమానించేలా మాట్లాడటం చట్టసభల గౌరవాన్ని దెబ్బతీసే చర్య అని అధికార పార్టీ నేతలు అభిప్రాయపడ్డారు. ఈ ఆరోపణలపై స్పందించిన తాతా మధు, తాను స్పీకర్ గడ్డం ప్రసాద్ లేదా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలను ఉద్దేశించి ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేశారు. స్పీకర్ స్థానానికి తనకు ఎంతో గౌరవం



ఉందని పేర్కొన్నారు. తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకుని రాజకీయ వివాదంగా మార్చే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారని తాతా మధు ఆరోపించారు.

మిగతా 2లో..

## తాతా మధు వ్యాఖ్యలతో స్పీకర్ భావోద్వేగం



- వ్యాఖ్యలు బాధించాయన్న గడ్డం ప్రసాద్
- సీతక్క కన్నీళ్లు చూసి కలత
- తెలియకుండానే కన్నీళ్లు వచ్చాయని వ్యాఖ్య
- తీర్మానం చేసి మండలికి పంపనున్న సభ

2లో

## తాతా మధు తీరును ఖండించిన సీతక్క



- వ్యవహారం అత్యంత ఖండనీయమన్న మంత్రి
- సభాపతిపై వ్యాఖ్యలు సిగ్గుచేటని విమర్శ
- సభ్యత్వం రద్దు చేయాలని విజ్ఞప్తి

2లో

## తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ గడువు పొడిగింపు




- అక్టోబర్ 7 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలకు అవకాశం
- కేంద్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ విడుదల
- నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

2లో

# యూట్యూబర్ నందన అరెస్ట్

- శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- లండన్ ఉద్యోగాల పేరుతో మోసం ఆరోపణలు
- లుకౌట్ నోటీసుల ఆధారంగా గుర్తింపు
- ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగింత




**హైదరాబాద్, సెప్టెంబర్ 7, (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ కావడంతో ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం ఆమెను కేసు విచారణ చేపడుతున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పోలీసుల వివరాల ప్రకారం నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి పలువురి నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. విదేశీ ఉద్యోగాల పేరుతో మోసపోయామని బాధితులు చేసిన ఫిర్యాదుల ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై కొంతకాలంగా దర్యాప్తు కొనసాగుతోంది. దర్యాప్తులో భాగంగా నందనపై లుకౌట్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. విదేశాలకు వెళ్లే అవకాశం ఉందన్న అనుమానంతో ఆమె కదలికలపై పోలీసులు నిఘా ఉంచారు. ఈ నేపథ్యంలో సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన

మిగతా 2లో..

## ఎమ్మెల్యేల విధులకు ఆటంకం కలిగించవద్దు

- రాష్ట్ర పోలీసులకు హైకోర్టు ఆదేశాలు
- అసెంబ్లీ ఘటనపై హోంశాఖకు నోటీసులు
- ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని స్పష్టీకరణ
- నిబంధనలు ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారని వ్యాఖ్య
- రెండు వారాలకు విచారణ వాయిదా



2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# స్పీకర్ అవమానంపై సీఎం ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

ఇలాంటి ప్రవర్తనను ఉపేక్షిస్తే చట్టసభల ప్రతిష్ఠ దెబ్బతింటుందని హెచ్చరించారు. అసభ్యకర భాషను ఉపయోగించిన సభ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం డిమాండ్ చేశారు. సంబంధిత సభ్యుడిని సభ నుంచి డిస్మిస్ చేయాలని కోరారు. అంతేకాకుండా ఆ సభ్యుడి చేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజీనామా చేయించాలని కూడా డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వాయిదా అనంతరం శాసనసభ తిరిగి ప్రారంభమైన తర్వాత స్పీకర్‌కు జరిగిన అవమానంపై చర్చ జరపాలని ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం తెలిపారు. అయితే ముందుగా 22ఏ అంశంపై చర్చ జరపాలని బీజేపీ సభ్యులు పట్టుబట్టారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ సభ్యుల వైఖరిని కూడా ఆయన తప్పుపట్టారు. బీఆర్ఎస్ నేతల చర్యలకు బీజేపీ నేతలు మద్దతు ఇవ్వడం సరికాదని వ్యాఖ్యానించారు.

స్పీకర్‌కు అవమానం జరిగిన ఈ రోజు తెలంగాణకు చీకటి రోజుగా నిలిచిపోతుందని రేవంత్ రెడ్డి అన్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి భంగం కలిగించిన ఘటనగా దీనిని అభివర్ణించారు. చట్టసభల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి సభ్యుడిపై ఉందని గుర్తు చేశారు. స్పీకర్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ ఘటన అనాలోచితంగా జరిగినది కాదని, ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగిందని సీఎం ఆరోపించారు. కేసీఆర్ తన పార్టీ ఎమ్మెల్యేలను సమావేశపరచి స్పీకర్‌పై ఉసిగొల్పారని విమర్శించారు. చట్టసభలను అగౌరవపరిచే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# అసెంబ్లీ గేటు వద్ద ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర వివాదాస్పదంగా మారింది. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని పోలీసులు మెడ పట్టుకుని నెట్టేశారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తన చీరను లాగారని ఆరోపిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ఇలాంటి వ్యవహారం ప్రజాస్వామ్య చరిత్రలో ఎప్పుడూ చూడలేదని బీఆర్ఎస్ మహిళా నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు కనీస గౌరవం ఇవ్వకుండా పోలీసులు వ్యవహరించారని మండిపడ్డారు.అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించేందుకు వస్తున్న ప్రతిపక్ష సభ్యులను అడ్డుకోవడం ప్రభుత్వం నిరంకుశ వైఖరికి నిదర్శనమని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన వైఫల్యాలను ప్రశ్నించకుండా ఉండేందుకే తమను అడ్డుకున్నారని ఆరోపించారు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను సభలో ప్రస్తావించాలనే ఉద్దేశంతో వచ్చిన తమపై పోలీసులు దౌర్జన్యానికి పాల్పడ్డారని పేర్కొన్నారు.ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అదుపులోకి తీసుకుని సమీప పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అసెంబ్లీ పరిసరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది. అధికార, ప్రతిపక్షాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ సమావేశాల మొదటి రోజే చోటుచేసుకున్న ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ గడువు పొడిగింపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 07, (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి గడువు పొడిగించింది. ఓటర్ల జాబితాపై క్లెయిమ్స్, అభ్యంతరాలు, సవరణల కోసం దరఖాస్తులు సమర్పించేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పిస్తూ సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల నమోదు, సవరణల ప్రక్రియకు మరింత సమయం లభించింది.

ఇంతకుముందు ఎన్నికల సంఘం ప్రకటించిన పొడిగించిన షెడ్యూల్ ప్రకారం క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలు గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ఇంకా అనేక మంది ఓటర్లు తమ వివరాలను సరిచేసుకునేందుకు, కొత్తగా నమోదు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో గడువు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి వేర్వేరుగా కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖలు రాసి గడువు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల అధికారుల విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర ఎన్నికల సంఘం సానుకూల నిర్ణయం తీసుకుంది. ప్రజలకు మరింత అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ గడువును అక్టోబర్ 7 వరకు పొడిగిస్తూ తాజా షెడ్యూల్‌ను ప్రకటించింది. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అర్హ పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో నమోదు కావాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల వర్గాలు పేర్కొన్నాయి.

కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు దరఖాస్తులు, అభ్యంతరాలు, సవరణల వినతులను స్వీకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారులు వాటిని పరిశీలించి విచారణలు నిర్వహిస్తారు. అర్హతలు, ఆధార పత్రాలను పరిశీలించిన తర్వాత తుది నిర్ణయాలు తీసుకుని ఓటర్ల జాబితాను ఖరారు చేయనున్నారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం అధికారులకు ఇప్పటికే సూచనలు జారీ చేసింది. ఈ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే యువతకు, ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోయిన వారికి, చిరునామా మార్పులు, ఇతర వివరాల సవరణలు చేయించుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించింది. రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు, ఎన్నికల సిబ్బంది కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకుని అర్హులైన ఓటర్ల వివరాలను సరిచూడాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు.

అన్ని క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ పూర్తయిన అనంతరం నవంబర్ 9వ తేదీన తెలంగాణ రాష్ట్ర తుది ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితాను మరింత ఖచ్చితత్వంతో రూపొందించేందుకు ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం కీలకంగా మారిందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియ మరింత పారదర్శకంగా, సమగ్రంగా కొనసాగేందుకు మార్గం సుగమం కానుంది.

# ఎమ్మెల్యేల విధులకు ఆటంకం కలిగించవద్దు

**హైదరాబాద్, సెప్టెంబర్ 07, (తెలంగాణ ముచ్చట్లు):** అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేల విధులకు ఆటంకం కలిగించవద్దని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర పోలీసు శాఖకు కీలక ఆదేశాలు జారీ చేసింది. అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద సోమవారం చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో దాఖలైన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం, ప్రజాప్రతినిధులు తమ రాజ్యాంగబద్ధ బాధ్యతలను నిర్వర్తించే విషయంలో ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని స్పష్టం చేసింది. ఈ ఘటనపై పూర్తి నివేదిక సమర్పించాలని రాష్ట్ర హోంశాఖకు నోటీసులు జారీ చేసింది. అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకున్నారంటూ ఆ పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. పిటిషన్‌లో పేర్కొన్న అంశాలను పరిశీలించిన న్యాయస్థానం, ప్రజల చేత ఎన్నుకోబడిన శాసనసభ్యులు సభకు హాజరై తమ బాధ్యతలు నిర్వర్తించేందుకు అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. శాసనసభ కార్యకలాపాల్లో పాల్గొనడం సభ్యుల హక్కు మాత్రమే కాకుండా బాధ్యత కూడా అని పేర్కొంది.ఈ సందర్భంగా న్యాయస్థానం రాష్ట్ర పోలీసులకు స్పష్టమైన సూచనలు చేసింది. అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవడం లేదా వారి విధులకు భంగం కలిగించే చర్యలకు పాల్పడకూడదని తెలిపింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించి, శాంతిభద్రతల నిర్వహణ పేరుతో ప్రజాప్రతినిధుల హక్కులకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. నిబంధనలు ఉల్లంఘించిన సందర్భాల్లో చట్టబద్ధమైన చర్యలు తీసుకునే అధికారం సభాపతికి ఉంటుందని హైకోర్టు వ్యాఖ్యానించింది. శాసనసభ కార్యకలాపాలకు సంబంధించిన వ్యవహారాల్లో సభకు స్వతంత్ర అధికారాలు ఉన్నాయని, సభ్యుల ప్రవర్తనపై నిర్ణయాలు తీసుకునే బాధ్యత స్పీకర్ పరిధిలోనే ఉంటుందని పేర్కొంది. అందువల్ల పోలీసు చర్యలు రాజ్యాంగబద్ధ వ్యవస్థల పరిధిని దాటకూడదని సూచించింది.అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు, పరిస్థితుల నివేదికను సమర్పించాలని హోంశాఖను న్యాయస్థానం ఆదేశించింది. ఆ రోజు చోటుచేసుకున్న పరిణామాలు, పోలీసుల చర్యలు, ప్రజాప్రతినిధుల అభ్యంతరాలపై సమగ్ర సమాచారం అందించాలని పేర్కొంది. తద్వారా వాస్తవ పరిస్థితులను పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. వాదనలు విన్న అనంతరం కేసు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. అప్పటివరకు హోంశాఖ నుంచి నివేదిక సమర్పించాలని ఆదేశించిన న్యాయస్థానం, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగబద్ధ హక్కులు పరిరక్షించబడేలా అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించింది. ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# అసెంబ్లీ వద్ద మహిళా ఎమ్మెల్యేల ఆగ్రహం

- **అసెంబ్లీ చరిత్రలో బ్లాక్ డేగా బీఆర్ఎస్ వ్యాఖ్యలు**
- **చీర లాగారని ఆరోపించిన సునీతా లక్ష్మారెడ్డి**
- **సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 7, (తెలంగాణ ముచ్చట్లు):** అసెంబ్లీ ప్రవేశ ద్వారం వద్ద జరిగిన ఘటనపై బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా మహిళా ప్రజాప్రతినిధులకు అవమానం జరిగిందని ఆరోపించారు. శాసనసభ చరిత్రలో ఇలాంటి ఘటన ఎన్నడూ చూడలేదని, ఈ రోజును బ్లాక్ డేగా పరిగణిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలు అని కూడా చూడకుండా పోలీసులు దారుణంగా ప్రవర్తించారని విమర్శించారు. అసెంబ్లీలోకి వెళ్లే సమయంలో పోలీసులు తమను అడ్డుకున్నారని, తోపులాటలో తన చీరను లాగారని



సునీతా లక్ష్మారెడ్డి ఆరోపించారు. ఇది వ్యక్తిగత అవమానం మాత్రమే కాదని, రాష్ట్రంలోని మహిళల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని అన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రజా జీవితంలో కొనసాగుతున్న మహిళా నాయకురాలిగా ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు వచ్చిన తమను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పలేక ప్రతిపక్షాన్ని అణచివేసే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. అసెంబ్లీలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా ఉండేందుకు ఉద్దేశపూర్వకంగా అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. తమ ఎమ్మెల్యేలు ధరించిన నల్లటి టీషర్టులపై ఉన్న నినాదాలను కారణంగా చూపుతూ అసెంబ్లీ గేటు వద్దకే వెళ్లనీయలేదని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష హక్కులను కాలరాయడం సరికాదని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాలతోనే ఈ ఘటన జరిగిందనే అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్ర మహిళలందరికీ సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరారు. ప్రజాప్రతినిధులను అవమానించడం ద్వారా ప్రజల గొంతుకను అణచివేయలేరని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పోలీసుల రాజ్యం నడుస్తోందా అనే సందేహం కలుగుతోందని సబితా ఇంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. మహిళా ఎమ్మెల్యేల జుట్టు, చీరలు పట్టుకుని లాగడం వంటి ఘటనలు తీవ్రంగా ఖండించదగ్గవని అన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కివేయాలనే ధోరణి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ఇలాంటి వైఖరి కొనసాగితే సాధారణ మహిళల భద్రతపై కూడా ప్రశ్నలు తలెత్తుతాయని పేర్కొన్నారు. అసెంబ్లీకి వచ్చిన మహిళా సభ్యులకే రక్షణ లేకపోతే రాష్ట్రంలోని మహిళలకు భద్రత ఎలా కల్పిస్తారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షానికి ఉన్న హక్కులను గౌరవించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ చరిత్రలో ఈ సంఘటన ఒక మచ్చగా నిలిచిపోతుందని, ప్రజల తరఫున తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# తాతా మధు వ్యాఖ్యలతో స్పీకర్ భావోద్వేగం

**హైదరాబాద్, సెప్టెంబర్ 7, (తెలంగాణ ముచ్చట్లు):**

ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ భావోద్వేగానికి గురయ్యారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం మాట్లాడుతూ తాతా మధు చేసిన వ్యాఖ్యలు తనను తీవ్రంగా బాధించాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో సభాపతి పదవికి ప్రత్యేక గౌరవం ఉందని, ఆ పదవిని లక్ష్యంగా చేసుకుని వచ్చిన వ్యాఖ్యలు విచారకరమని అన్నారు. మంత్రి సీతక్కతో తనకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా స్పీకర్ గుర్తుచేసుకున్నారు. గత ఐదేళ్లుగా సీతక్క తనకు రాఖీ కడుతున్నారని, కుటుంబ సభ్యుడిలా భావిస్తూ వస్తున్నారని చెప్పారు. సభలో జరిగిన పరిణామాల సమయంలో సీతక్క తీవ్ర భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకోవడం తనను కూడా కలచివేసిందని తెలిపారు.

సభలో సీతక్క మాట్లాడుతున్న సమయంలో తనకు తెలియకుండానే కన్నీళ్లు వచ్చాయని స్పీకర్ పేర్కొన్నారు. ఆమె ఆవేదనను చూసి తన భావోద్వేగాలను అదుపు చేసుకోలేకపోయానని అన్నారు. ప్రజాప్రతినిధుల మధ్య పరస్పర గౌరవం, మర్యాదలు ఉండాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తాతా మధు వ్యాఖ్యల అంశాన్ని శాసనసభలో సీరియస్‌గా పరిగణిస్తున్నట్లు స్పీకర్ తెలిపారు. ఈ ఘటనపై సభలో తీర్మానం ఆమోదించి శాసనమండలికి పంపే ప్రక్రియ చేపడతామని వెల్లడించారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.సభల గౌరవాన్ని కాపాడటం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని గడ్డం ప్రసాద్ అన్నారు. వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్య వ్యవస్థకు మేలు చేయవని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని రాజకీయ పక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. తాతా మధు వ్యాఖ్యల నేపథ్యంలో అసెంబ్లీ, శాసనమండలిలో రాజకీయ చర్చలు మరింత వేడెక్కాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్న వేళ స్పీకర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# తాతా మధు తీరును ఖండించిన సీతక్క

**హైదరాబాద్, సెప్టెంబర్ 7, (తెలంగాణ ముచ్చట్లు):**

శాసనమండలి సభ్యుడు తాతా మధు వ్యవహార శైలిని రాష్ట్ర మంత్రి సీతక్క తీవ్రంగా ఖండించారు. ఆయన ప్రవర్తన అత్యంత అభ్యంతరకరమైందని పేర్కొంటూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధులు పాటించాల్సిన విలువలను తాతా మధు ఉల్లంఘించారని విమర్శించారు. ముఖ్యంగా అసెంబ్లీ ప్రాంగణంలో చోటుచేసుకున్న ఘటనలు ప్రజాస్వామ్యానికి మచ్చతెచ్చే విధంగా ఉన్నాయని అన్నారు. తాతా మధు పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించడమే కాకుండా విధుల్లో ఉన్న సిబ్బందిని తోసివేయడం, అవమానకరంగా మాట్లాడటం సరైన చర్య కాదని సీతక్క పేర్కొన్నారు. చట్టాన్ని అమలు చేసే అధికారుల పట్ల గౌరవం చూపాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై మరింతగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. అంతకంటే బాధాకరమైన విషయం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలేనని మంత్రి అన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న సభాపతిపై అవమానకరమైన భాష వాడటం మొత్తం సమాజాన్ని తలదించుకునేలా చేసిందని పేర్కొన్నారు. ముఖ్యంగా సామాజికంగా వెనుకబడిన వర్గాల నుంచి ఎదిగి ఉన్నత పదవిని అలంకరిస్తున్న వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. సభాపతి పదవికి గౌరవం ఇవ్వడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని సీతక్క స్పష్టం చేశారు. వ్యక్తిగత రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ రాజ్యాంగ సంస్థలు, ప్రజాస్వామ్య వ్యవస్థలకు సంబంధించిన పదవులను గౌరవించాల్సిందేనని పేర్కొన్నారు. ఈ విషయంలో తాతా మధు ప్రవర్తన అన్ని హద్దులు దాటిందని విమర్శించారు. ఈ ఘటనపై తక్షణ చర్యలు తీసుకోవాలని సీతక్క డిమాండ్ చేశారు. తాతా మధును వెంటనే శాసనమండలి నుంచి సస్పెండ్ చేయాలని, ఆయన సభ్యత్వాన్ని కూడా రద్దు చేసే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. ఇటువంటి చర్యల ద్వారా మాత్రమే ప్రజాస్వామ్య వ్యవస్థ గౌరవాన్ని కాపాడగలమని ఆమె అభిప్రాయపడ్డారు. సభల గౌరవం, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడం అందరి బాధ్యత అని సీతక్క అన్నారు. ప్రజాప్రతినిధులు తమ ప్రవర్తన ద్వారా ప్రజలకు ఆదర్శంగా నిలవాలని, అనుచిత వ్యాఖ్యలు, దురుసు ప్రవర్తనకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదని స్పష్టం చేశారు. తాతా మధు వ్యవహారంపై అన్ని వర్గాలు స్పందించి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఆమె పిలుపునిచ్చారు.

# తన వ్యాఖ్యలపై తాతా మధు వివరణ

(మొదటి పేజీ తరువాయి)

ఆ సమయంలో తన ప్యాంటు లాగి, గొంతు నొక్కేందుకు ప్రయత్నించిన పోలీసు అధికారుల తీరుపైనే తాను ఆగ్రహం వ్యక్తం చేశానని చెప్పారు. తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల్లో మాట్లాడిన మాటలను ఇప్పుడు స్పీకర్‌కు ఆపాదిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. తనపై కాంగ్రెస్ పార్టీ కావాలనే దుష్ప్రచారం చేస్తోందని తాతా మధు మండిపడ్డారు. అసలు విషయాన్ని పక్కనపెట్టి, తన వ్యాఖ్యలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ వ్యవహారంలో తనకు ఎలాంటి తప్పు లేదని, నిజాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించాల్సిన ప్రభుత్వం వాటిని పక్కనపెట్టి రాజకీయ ఆరోపణలకే పరిమితమైందని తాతా మధు విమర్శించారు. ప్రజల సమస్యలపై చర్చించే ధైర్యం, సామర్థ్యం లేకపోవడంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వివాదాన్ని సృష్టించిందని అన్నారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ వ్యవహారాన్ని పెద్దది చేస్తున్నారని ఆరోపించారు.

పోలీసుల అక్రమాలను ప్రశ్నిస్తే దాన్ని స్పీకర్‌ను అవమానించినట్లుగా చిత్రీకరించడం సరికాదని తాతా మధు అన్నారు. కాంగ్రెస్ నేతలు రాజకీయ ప్రయోజనాల కోసం శవరాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. తమపై వస్తున్న డిమాండ్లకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అధికార, ప్రతిపక్షాల మధ్య కొనసాగుతున్న ఈ ఆరోపణలు, ప్రత్యారోపణలతో అసెంబ్లీ ప్రాంగణంలో రాజకీయ వేడి మరింత పెరిగింది.

# యూట్యూబర్ నందన అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

ఆమెను ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎయిర్‌పోర్ట్ పోలీసులు నందనను అదుపులోకి తీసుకుని అవసరమైన ధృవీకరణ ప్రక్రియ పూర్తి చేశారు. అనంతరం కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఆమె నుంచి మరిన్ని వివరాలు సేకరించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

ఈ కేసులో బాధితుల సంఖ్య, వసూలు చేసిన మొత్తాలపై కూడా పోలీసులు దృష్టి సారించారు. విదేశీ ఉద్యోగాల పేరుతో మరెవరైనా మోసపోయారా అనే కోణంలో కూడా విచారణ కొనసాగుతోంది. నందనతో పాటు ఆమె భర్త పాత్రపై కూడా అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా వెలుగులోకి రావాల్సి ఉంది. బాధితుల ఫిర్యాదులు, ఆర్థిక లావాదేవీల ఆధారాలు, ఇతర సాక్ష్యాలను పరిశీలిస్తూ పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు. విచారణలో బయటపడే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
మంగళవారం - 08 - సెప్టెంబర్ - 2026



## హామీలు అమలు చేసే వరకు ఉద్యమమే




- **కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన బీఆర్ఎస్**

**రామడుగు, సెప్టెంబర్ 7(తెలంగాణ ముచ్చట్లు ):**కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం రామడుగు మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వీర్ల వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షులు జితేందర్ రెడ్డితో పాటు మండల సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, యువజన, విద్యార్థి, మహిళా విభాగాల నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పలుస శంకర్ గౌడ్ సేవలకు దక్కిన గౌరవం



- **సాహిత్య, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో సేవలకు గుర్తింపు**

**వనపర్తి,సెప్టెంబరు(07(తెలంగాణ ముచ్చట్లు):** సాహిత్య, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో విశేష సేవలందిస్తున్న సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్‌కు గౌరవం దక్కింది. కొత్త తెలంగాణ చరిత్రబృందం ఆధ్వర్యంలో ఆదివారం నందికంది క్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించారు.సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది క్షేత్రంలో నిర్వహించిన బొమ్మలపల్లకి ప్రతిభా పురస్కార సభకు పలుస శంకర్ గౌడ్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ప్రాంతంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలపై కొత్త తెలంగాణ చరిత్రబృందం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన దృశ్యచిత్ర పోటీల్లో విజేతలైన వారికి ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు.సాహిత్య, సాంస్కృతిక, సామాజిక రంగాలకు పలుస శంకర్ గౌడ్ అందిస్తున్న సేవలను గుర్తించిన కొత్త తెలంగాణ చరిత్రబృందం ప్రతినిధులు ఆయనను ఘనంగా సన్మానించారు. జాతీయ కార్యవర్గం, పాలక మండలి సభ్యులు మణికొండ వేదకుమార్, ఫ్లీచ్ ఇండియా ఫౌండేషన్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, కొత్త తెలంగాణ చరిత్రబృందం రాష్ట్ర కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ ఆయనను సత్కరించారు.ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి సన్మానించడం ఎంతో ఆనందంగా, గౌరవంగా ఉందన్నారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సాహిత్య పరిరక్షణకు తన వంతు కృషి కొనసాగిస్తానని తెలిపారు.రోజంతా కొనసాగిన ఈ కార్యక్రమంలో కొత్త తెలంగాణ చరిత్రబృందం ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్, చరిత్ర పరిశోధకులు అరవింద్ ఆర్య, కపిలవాయి అశోక్‌బాబు, రవీందర్‌రెడ్డి, స్రవంతి విజయభాస్కర్‌రెడ్డి, రంగాచార్య, డాక్టర్ బైరోజు శ్యాంసుందర్, రాములు, గణేశ్‌కుమార్, శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అవార్డులు ఉద్యోగులకు ప్రేరణనిస్తాయి




- **పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు**

**వనపర్తి,సెప్టెంబర్07(తెలంగాణ ముచ్చట్లు):**అవార్డులు ఉద్యోగులకు మరింత ప్రేరణనిచ్చి, విధి నిర్వహణలో మరింత అంకితభావంతో పనిచేసేలా ఉత్సాహాన్ని కలిగిస్తాయని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు.జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న కంచిరావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల భాషా ఉపాధ్యాయుడు వంగూరు నారాయణ రెడ్డిని సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ వృత్తి ధర్మాన్ని చిత్తశుద్ధితో నిర్వహిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం అభినందనీయమన్నారు.విద్యార్థులు ఆంగ్ల భాషలో రాణించేలా అంకితభావంతో పనిచేస్తున్న వంగూరు నారాయణరెడ్డికి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కడం సంతోషకరమైన విషయమన్నారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా విద్యారంగంలో మరింత ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని శంకర్ గౌడ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, అనురాధ, రాజేష్‌బాబు, రాజు, బైరోజు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, కృష్ణవేణి, శేఖర్, ఫాతిమా, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేతల అరెస్టుపై నిరసన






- **సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో సత్తుపల్లిలో ర్యాలీ.**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు):** అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడం, పలువురు నేతలను అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ సత్తుపల్లిలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన నిర్వహించాయి. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో సోమవారం జీవీ మాల్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నల్ల కండువాలు, నల్ల జెండాలతో నిరసన ర్యాలీ చేపట్టారు. నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అసెంబ్లీకి నల్ల టీషర్టులు ధరించి వెళ్లిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడం సరికాదని సండ్ర వెంకట వీరయ్య అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షం హక్కు అని పేర్కొన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు తదితర నేతలను అదుపులోకి తీసుకున్న తీరును ఆయన ఖండించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపైనా అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో నల్ల దుస్తులతో నిరసన తెలిపే అవకాశం ఉన్నప్పుడు అసెంబ్లీలోనూ ప్రజాప్రతినిధులకు ఆ హక్కు ఉండాలని సండ్ర అన్నారు. ప్రజా సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రస్తావించడం ప్రతిపక్ష బాధ్యత అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీల అమలుపై ప్రజల్లో ప్రశ్నలు ఉన్నాయని సండ్ర అన్నారు. మహిళలకు నెలకు రూ.2,500, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, విద్యార్థులకు స్కూటర్లు, కల్యాణలక్ష్మి-షాదీ ముబారక్‌లో తులం బంగారం, అర్హులైన పేదలకు ఇళ్ల వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని సండ్ర స్పష్టం చేశారు. అనంతరం ప్రజల నుంచి సేకరించిన వివిధ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను ప్రజావాణిలో అధికారులకు సమర్పించారు.

# రేవల్లి మండల ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



- **రేవల్లిలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**

**రేవల్లి,సెప్టెంబరు07(తెలంగాణ ముచ్చట్లు- ):**ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా రేవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ, మండల ఉపాధ్యాయ సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 15 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.మండలంలోని ఉపాధ్యాయుల సేవలను పరిగణనలోకి తీసుకుని ఉపాధ్యాయ సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. తొలుత ఎంపికైన వారిలో ప్రాథమిక పాఠశాల నాగపూర్‌కు చెందిన ఎస్‌జీటీ శ్రీమతి లియోనా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నాగపూర్ పాఠశాల సహాయకులు అంబాశంకర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రేవల్లి పాఠశాల సహాయకులు కే. దశరథ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బండరావిపాకుల పాఠశాల సహాయకురాలు మహాలక్ష్మి, మండల పరిషత్ ఉన్నత పాఠశాల తలుపునూరు పాఠశాల సహాయకులు ఎస్. చంద్రకాంత్, కేజీబీవీ రేవల్లి సీఆర్‌టీ ఏ. సరస్వతి ఉన్నారు.అలాగే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గొల్లపల్లికి చెందిన ఎస్‌జీటీ టి. వెంకటమ్మ, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల కేశంపేటకు చెందిన ఎస్‌జీటీ ఎస్. కృష్ణయ్య, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గొల్లపల్లికి చెందిన ఎస్‌జీటీ పి. శ్రీశైలం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రేవల్లికి చెందిన ఎస్‌జీటీ కే. శిరీష, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కొంకలపల్లికి చెందిన ఎస్‌జీటీ బి. రాముడు, ప్రాథమిక పాఠశాల గౌరీదేవిపల్లికి చెందిన ఎస్‌జీటీ ఆర్. శ్రీకాంత్‌లను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు.అనంతరం మరో ముగ్గురు ఉపాధ్యాయులను కూడా మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. వారిలో ప్రాథమిక పాఠశాల నాగపూర్‌కు చెందిన ఎస్‌జీటీ ఎస్. ఆంజనేయులు, ప్రాథమిక పాఠశాల రేవల్లికి చెందిన ఎస్‌జీటీ శ్రీమతి పి. అనురాధ, కేజీబీవీ రేవల్లికి చెందిన గణిత సీఆర్‌టీ శ్రీమతి కాంత ఉన్నారు. దీంతో మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారి సంఖ్య 15కు చేరింది.ఈ సందర్భంగా ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అంకితభావంతో సేవలందిస్తూ, విద్యారంగానికి విశేష కృషి చేస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని అభినందిస్తూ, వారి సేవలు మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి కుమారి కీర్తన, మండల విద్యాధికారి ఎస్. వరప్రసాద్ రావు, పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు పి. ప్రసాద్, జిల్లా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల అధ్యక్షులు శ్రీ రామమూర్తి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్–బీజేపీ వైఫల్యాలపై బీఆర్ఎస్ సమరభేరి

- **66 డివిజన్ల సమస్యలపై ప్రజావాణిలో వినతులు**
- **నగర సమస్యలు పరిష్కరించడంలో విఫలం: చల్లా హరిశంకర్**



**కరీంనగర్, సెప్టెంబర్ 7(తెలంగాణ ముచ్చట్లు ):** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన, కరీంనగర్ నగరపాలక సంస్థలో బీజేపీ పాలనలో ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన వారం రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఏడో రోజు కరీంనగర్‌లో ఆందోళన హోరెత్తింది. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు భారీ నిరసన నిర్వహించి, పాలకుల వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నగరంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు.

ఈ సందర్భంగా హరిశంకర్ మాట్లాడుతూ.. నగరంలో వీధిదీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, చెత్తాచెదారం పేరుకుపోయిందని విమర్శించారు. తాగునీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మున్సిపల్ పాలనలో అవినీతి రాజ్యమేలుతోందని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం, నగరపాలక సంస్థలోని బీజేపీ పాలకులు కలిసి కరీంనగర్ అభివృద్ధిని విస్మరించారని ఆయన విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప.. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో, బీజేపీ నగర పాలనలో ప్రజలకు చెప్పుకోదగ్గ అభివృద్ధి కనిపించడం లేదన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ ఎప్పటికీ పోరాడుతుందని, ప్రజలకు అండగా గులాబీ శ్రేణులు ఉంటాయని హరిశంకర్ భరోసా ఇచ్చారు.

నిరసన అనంతరం నగరపాలక సంస్థ ప్రజావాణిలో 66 డివిజన్లకు సంబంధించిన సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు, మాజీ మేయర్ రవీందర్ సింగ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ఇన్‌చార్జీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేల అరెస్ట్‌పై భగ్గుమన్న బీఆర్ఎస్

- **అసెంబ్లీలో ప్రతిపక్ష గొంతును అణచివేయడం సరికాదు**






**కరీంనగర్, సెప్టెంబర్ 7(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు నల్లచొక్కాలు ధరించి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ కరీంనగర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఆందోళన చేపట్టాయి. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో సబ్బండ వర్గాలకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ చేపట్టిన నిరసనల్లో భాగంగా సోమవారం కరీంనగర్ బస్టాండ్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్లా హరిశంకర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీసేందుకు వెళ్తున్న ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ప్రతిపక్ష గొంతును అణచివేయడం సరికాదని, ప్రజా సమస్యలపై మాట్లాడే హక్కును ప్రభుత్వం గౌరవించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదని, ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా సర్వేపల్లి రాధాకృష్ణన్




- **మంజులత, మండల విద్యాధికారి**

**పెద్దమందడి,సెప్టెంబరు07(తెలంగాణ ముచ్చట్లు):** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి పదవులను అలంకరించి ఉపాధ్యాయులందరికీ ఎనలేని కీర్తిని తీసుకువచ్చారని వనపర్తి జిల్లా పెద్దమందడి మండల విద్యాధికారి మంజులత అన్నారు.రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సోమవారం పెద్దమందడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 17 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి శాలువా, పుష్పగుచ్ఛం, ప్రశంసాపత్రం, జ్ఞాపికలతో సన్మానించారు.ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని మంజులత పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను నేర్పుతూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు మరింత అంకితభావంతో పనిచేసి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో రేవల్లి మండల విద్యాధికారి వరప్రసాద్‌రావు, పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు శాంతన్న, పి. ప్రసాద్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బాణం విష్ణు, వెంకటేష్, పెద్దమందడి సర్పంచ్ గంగమ్మ, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉత్తమ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు?



**అల్వాల్, సెప్టెంబర్ 7 ( తెలంగాణ ముచ్చట్లు):**ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లను వెంటనే అమలు చేసి ప్రజలకు ప్రయోజనాలు అందించాలని డిమాండ్ చేస్తూ అల్వాల్ సర్కిల్ బీఆర్ఎస్ నాయకులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు.
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు నందికంటి శ్రీధర్ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సబిత్ కిషోర్, డోలి రమేష్, శ్రీధర్ గౌడ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అల్వాల్ డీసీ భోగేశ్వర్, డీటీ పృథ్వీని కలిసి వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని, పెండింగ్‌లో ఉన్న హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.
ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించి సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని వారు కోరారు. హామీల అమలులో జాప్యం చేస్తే ప్రజల తరఫున మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

## ప్రజా అవసరాలే ప్రాధాన్యం.. అభివృద్ధే లక్ష్యం




- **ఆరెపల్లిలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం**
- **మేయర్ కొలగాని శ్రీనివాస్ చేతుల మీదుగా శంకుస్థాపన**

**కరీంనగర్, సెప్టెంబర్ 7(తెలంగాణ ముచ్చట్లు ):** నగరంలోని 1వ డివిజన్ ఆరెపల్లిలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.
మున్సిపల్ సాధారణ నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా సమర్థవంతంగా వినియోగిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ఆరెపల్లిలో నిర్మించనున్న సీసీ రోడ్డు పూర్తయితే స్థానిక ప్రజలు, వాహనదారులకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని తెలిపారు.
పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను మేయర్ ఆదేశించారు. పనులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి నాణ్యతలో రాజీ పడకుండా చూడాలని సూచించారు.
అభివృద్ధి పనులపై స్థానిక కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ మేయర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.
కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బారి అపర్ణ జితేందర్, మున్సిపల్ అధికారులు, కాలనీ ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సమానత్వం, సమాజహితమే ఎమ్మార్పీఎస్ ఆశయం

- **కొమ్ము చెన్న కేశవులు వనపర్తి నియోజకవర్గ ఇన్చార్జ్**




**పెద్దమందడి,సెప్టెంబరు07(తెలంగాణ ముచ్చట్లు):** సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను రూపుమాపి సమానత్వం సాధించడమే ఎమ్మార్పీఎస్ ఆశయమని ఎమ్మార్పీఎస్ వనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్ము చెన్నకేశవులు మాదిగ అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.పెద్దమందడి మండలం గట్ల ఖానాపురం గ్రామంలోని సామాజిక భవనంలో సీనియర్ నాయకులు కృష్ణయ్య మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, అనుబంధ విభాగాల నూతన గ్రామ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవులు మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ప్రారంభమైన ఉద్యమం అనేక సామాజిక సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేసిందన్నారు. అణగారిన వర్గాలకు అన్ని రంగాల్లో న్యాయం జరగాలంటే ఉద్యమాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం యువతరం ఉద్యమంలోకి వచ్చి సమాజం కోసం పోరాడాలని కోరారు. దోపిడీ, వివక్ష, పీడన, అసమానతలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ ముందుకు సాగుతోందన్నారు.అనంతరం పెద్దమందడి మండలం గట్ల ఖానాపురం గ్రామ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా గుర్రాల చంద్రాయనాయుడు మాదిగ, అధికార ప్రతినిధిగా ఇంటివెంకి నాగరాజు మాదిగ, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు మాదిగలను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులు, కోశాధికారి, కార్యదర్శులను కూడా ఎంపిక చేశారు.

# ఆరు గ్యారంటీలపై ఆగ్రహం.. అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ రాస్తారోకో





- **ముల్కనూర్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం.. ఎంపీడీవోకు వినతిపత్రం**

**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 07(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో ఆందోళన చేపట్టారు.
ఆరు గ్యారంటీల అమలు కోసం ఆందోళనలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేస్తోందని ఆరోపిస్తూ ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు.
ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.
ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరుతూ భీమదేవరపల్లి ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు.

# రత్నగిరి జాతరలో భక్తులకు సేవలందించిన సెయింట్ థామస్ విద్యార్థులు






- **భక్తులకు తాగునీరు అందిస్తూ సేవాభావం చాటుకున్న విద్యార్థులు**

**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 07 (తెలంగాణ ముచ్చట్లు):** భీమదేవరపల్లి మండలంలోని రత్నగిరి జాతరలో ఎల్కతుర్తి మండల కేంద్రంలోని సెయింట్ థామస్ అల్టిట్యూడ్ హైస్కూల్ విద్యార్థులు సేవా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రత్నగిరిలోని ఎంతో విశిష్టమైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి జాతర సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు విద్యార్థులు తాగునీరు అందిస్తూ తమ సేవాభావాన్ని చాటుకున్నారు.
జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా భక్తులకు నీటిని అందిస్తూ, దాహంతో ఉన్న వారికి స్వయంగా తాగునీరు అందించడం ద్వారా మానవతా దృక్పథాన్ని ప్రదర్శించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, క్రమశిక్షణతో సేవా కార్యక్రమంలో పాల్గొనడం పలువురిని ఆకట్టుకుంది.
ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పుస్కూరి కార్తీక్ రావు మాట్లాడుతూ.. విద్యార్థులు రత్నగిరి జాతరలో ఎంతో ఉత్సాహంగా పాల్గొని భక్తులకు తాగునీరు అందించడం అభినందనీయమన్నారు. చిన్న వయసులోనే విద్యార్థుల్లో సేవాభావం, మానవతా విలువలు పెంపొందించడం ఎంతో అవసరమని తెలిపారు.
విద్యార్థులకు పాఠ్యపుస్తకాల ద్వారా అందించే విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యత, ఇతరులకు సహాయం చేయాలనే ఆలోచన, సేవా దృక్పథం వంటి మంచి లక్షణాలను చిన్నప్పటి నుంచే అలవర్చాలని అన్నారు. ఇందుకోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను నిరంతరం ప్రోత్సహించాలని సూచించారు.
"విద్యార్థుల్లో సేవాభావం పెంపొందితే వారు భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగడంతో పాటు ఉన్నత స్థాయికి చేరుకుంటారు. ఇతరులకు సహాయం చేయాలనే మనసు, సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండటం నిజమైన విద్యకు ప్రతీక" అని పుస్కూరి కార్తీక్ రావు పేర్కొన్నారు.
రత్నగిరి జాతర వంటి ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని భక్తులకు సేవ చేయడం ద్వారా వారిలో సామాజిక బాధ్యత మరింత పెరుగుతుందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ విద్యార్థుల్లో మానవతా విలువలను పెంపొందించేందుకు పాఠశాల తరఫున మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.
విద్యార్థుల సేవా కార్యక్రమాన్ని చూసిన భక్తులు, స్థానికులు అభినందించారు. చిన్న వయసులోనే విద్యార్థులు చూపిస్తున్న సేవా స్ఫూర్తి అభినందనీయమని పేర్కొన్నారు.
పాఠశాల సిబ్బంది పాల్గొనడం
ఈ సేవా కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మర్రి అశోక్, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రే తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల రాకపోకలు, సేవా కార్యక్రమానికి సహకరించిన డ్రైవర్లు శ్రీనివాస్, కిరణ్, సంపత్, రాకేష్, వివేక్‌తో పాటు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు అవసరమైన సహకారం అందిస్తూ సేవా కార్యక్రమం విజయవంతంగా జరిగేలా పాఠశాల సిబ్బంది సమన్వయంతో వ్యవహరించారు.

# స్పీకర్‌పై వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీపై చర్యలు తీసుకోవాలి

- **బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలి: వొడితల ప్రణవ్**



**హుజురాబాద్,సెప్టెంబర్ 7(తెలంగాణ ముచ్చట్లు ):** అసెంబ్లీ సాక్షిగా ఉన్నత పదవిలో ఉన్న స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలకు బీఆర్ఎస్ పార్టీ క్షమాపణ చెప్పి, వెంటనే మధుపై చర్యలు తీసుకోవాలని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ప్రణవ్ అన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని హామీ ఇచ్చి పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు అదే దళిత జాతికి చెందిన వ్యక్తి స్పీకర్‌గా ఉన్నత పదవిలో కొనసాగుతుండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు.ప్రజాస్వామ్య వ్యవస్థకు ఇది చీకటి దినమని ఆయన పేర్కొన్నారు.
ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించాల్సిన ప్రజాప్రతినిధులు సభ వెలుపల అనుచితంగా, దుర్భాషలాడటం సమంజసం కాదన్నారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని, ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ అదే విధానాన్ని కొనసాగిస్తోందని ఆరోపించారు. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఇలాంటి అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఉపేక్షించబోదని వొడితల ప్రణవ్ స్పష్టం చేశారు. తాతా మధుపై తక్షణమే చర్యలు తీసుకోవడంతో పాటు బీఆర్ఎస్ పార్టీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## హామీలు అమలు చేయాలి.. ప్రజావాణిలో బీఆర్ఎస్ వినతి



**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 07 (తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో పేద ప్రజలకు ఇచ్చిన సంక్షేమ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతి పత్రాలు సమర్పించారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు వారం రోజుల పాటు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా సోమవారం చివరి రోజు మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో అధికారులకు వినతులు అందజేశారు.
జమ్మికుంటలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఆధ్వర్యంలో ఎంపీడీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ప్రజలకు సంబంధించిన సమస్యలు, సంక్షేమ పథకాలపై ప్రభుత్వం దృష్టి సారించి హామీలను నెరవేర్చేలా అధికారులు నివేదికలను ప్రభుత్వానికి పంపించాలని విజ్ఞప్తి చేశారు.
ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చూడాలని ఎంపీడీవో, తహసీల్దార్, కమిషనర్‌లను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు అమలు చేయాలి




- ప్రజావాణిలో బీఆర్ఎస్ నాయకుల వినతి

**వీణవంక, సెప్టెంబర్ 07 (తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వీణవంక మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని కోరారు. ఆరు గ్యారంటీల అమలులో జాప్యం చేయకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.
అలాగే మండలంలోని ఇసుక క్వారీల నుంచి భారీగా ఇసుక తరలింపుతో దెబ్బతిన్న రహదారులను వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. రహదారులు అధ్వానంగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.
వీణవంక, జమ్మికుంట మండలాల వ్యవసాయానికి సాగునీటిని అందించే ప్రధాన వనరుగా ఉన్న కల్వల ప్రాజెక్టుకు తక్షణమే మరమ్మతులు చేపట్టి, సాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టు పునరుద్ధరణ పనులను త్వరితగతిన చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం, అధికారులు ప్రాధాన్యతగా తీసుకొని పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు.

## ఆర్టీఐ నియోజకవర్గ అధ్యక్షుడిగా నాగార్జున

- ఏకగ్రీవంగా ఎంపిక చేసిన జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్



**హుజూరాబాద్,సెప్టెంబర్ 7(తెలంగాణ ముచ్చట్లు ):** సమాచార హక్కు చట్టం (RTI) సాధన కమిటీ హుజూరాబాద్ నియోజకవర్గ నూతన అధ్యక్షుడిగా తిరగమల్ల నాగార్జున నియమితులయ్యారు. ఇప్పటివరకు హుజూరాబాద్ మండల అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన సేవలను గుర్తించిన కమిటీ ఉన్నత నాయకత్వం, ఆయనకు నియోజకవర్గ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించింది.
జిల్లా కన్వీనర్ బండ నరేందర్ సహకారంతో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ, రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్ సమక్షంలో తిరగమల్ల నాగార్జునను నియోజకవర్గ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ తన సేవలను గుర్తించి నియోజకవర్గ అధ్యక్షుడిగా ప్రమోట్ చేసిన జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్‌కు, నిరంతరం ప్రోత్సహిస్తూ సహకరిస్తున్న జిల్లా కన్వీనర్ బండ నరేందర్‌కు, రాష్ట్ర కమిటీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, ఆర్టీఐ చట్టం ద్వారా ప్రజలకు లభించాల్సిన న్యాయమైన హక్కులను సాధించేందుకు నిరంతరం కృషి చేస్తానని నాగార్జున తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామానికి RTI చట్టం విశిష్టతను తీసుకెళ్లేలా కార్యక్రమాలు నిర్వహించి కమిటీని మరింత బలోపేతం చేస్తానని స్పష్టం చేశారు.
నాగార్జున నియామకంపై జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్, జిల్లా కన్వీనర్ బండ నరేందర్‌తో పాటు కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తూ నాగార్జునకు శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం: సర్పంచ్ గజ్జెల సృజన రమేష్

- వంగరలో విద్యుత్ సమస్యలపై అధికారుల దృష్టికి పలు అంశాలు




**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 07(తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎన్‌పీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ సోమవారం వంగర గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గజ్జెల సృజన రమేష్ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో లూజ్ పోల్స్, విద్యుత్ స్తంభాల సమస్యలు, కొత్త విద్యుత్ కనెక్షన్ల అవసరం, స్ట్రీట్ లైట్ల సమస్యలు, విద్యుత్ వైర్లకు సంబంధించిన సమస్యలను సర్పంచ్ అధికారులకు వివరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా సూపరింటెండెంట్ హామీ ఇచ్చారు.
గ్రామంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని సర్పంచ్ గజ్జెల సృజన రమేష్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేష్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## బీఅర్ఎస్ నేతల దిష్టిబొమ్మల దహనం



**మల్కాజిగిరి, సెప్టెంబర్ 7 ( తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. బీ అర్ ఎస్ ప్రజాప్రతినిధులు నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి హాజరయ్యే క్రమంలో పోలీసులు వారిని అడ్డుకున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందిపై బీ అర్ ఎస్ నేతలు భౌతికంగా దాడులకు పాల్పడ్డారని, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఈ ఘటనకు నిరసనగా పీసీసీ , పీసీసీ ఎస్ సి డిపార్ట్‌మెంట్ చైర్మన్ మహేష్ కుమార్, కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్టలోని భూదేవి హిల్స్ పరిధిలో బీ అర్ ఎస్ పార్టీ నేతల దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు.
పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర వైస్ చైర్మన్, జిల్లా చైర్మన్ కవ్వాలి చంద్రయ్య ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్వా బీ అర్ బీ బ్లాక్ నియోజకవర్గ అధ్యక్షుడు సోల్మన్ రాజు, 280వ డివిజన్ అధ్యక్షుడు అరుణ్ కుమార్, 295వ డివిజన్ మైనారిటీ అధ్యక్షుడు షేక్ షరీఫ్, 289బీ డివిజన్ అధ్యక్షుడు గడ్డం ప్రసాద్ పాల్గొన్నారు.అనంతరం మాజీ డీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రావణ్ కుమార్‌తో పాటు కౌసల్య, మాధవి రెడ్డి, లలిత, యువరాజ్, సోమేష్, రాహేష్, ధనుష్, భూని, సన్నీ, మనీష్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీ అర్ ఎస్ నేతల తీరును కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండిస్తూ, ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని డిమాండ్ చేశారు.

## సిరిసేడులో క్రీడా సందడి.. సిద్ధమైన క్రీడా ప్రాంగణం!



**ఇల్లందకుంట, సెప్టెంబర్ 07 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలో క్రీడా సంబరాలకు రంగం సిద్ధమైంది. సిరిసేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం వేదికగా ఈ నెల 10, 11 తేదీల్లో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ, ఎస్‌జీఎఫ్ అధ్యక్షుడు రాములు తెలిపారు. రెండు రోజుల పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేలా పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 10న బాలికలకు, 11న బాలురకు అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయి. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటేందుకు సిద్ధమవుతున్నారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని నిర్వాహకులు తెలిపారు. పోటీలను విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి. సత్యనారాయణను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

## పీఆర్సీ.. డీఏలు.. బకాయిలు.. పరిష్కారం ఎప్పుడు?

**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 07 (తెలంగాణ ముచ్చట్లు):** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నమనేని తిరుపతిరావు డిమాండ్ చేశారు. తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం జమ్మికుంట మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు.
వావిలాల, తనుగుల, బిజిగిరి షరీఫ్, గంగ్రపల్లి, విలాసాగర్, కోరపల్లి, శాయంపేట, ధర్మారం, కొత్తపల్లి, మడిపల్లి, జమ్మికుంట తదితర పాఠశాలల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా అన్నమనేని తిరుపతిరావు మాట్లాడుతూ..గత మూడు సంవత్సరాలుగా వేతన సవరణ సంఘం నివేదిక పెండింగ్‌లో ఉందని, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. పీఆర్సీ నివేదికను తెప్పించి 53 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.
అలాగే పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయడంతో పాటు ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను ఉపాధ్యాయ అర్హత పరీక్ష నుంచి మినహాయించాలని విజ్ఞప్తి చేశారు.
పాఠశాల విద్యార్థుల పరీక్ష జవాబు పత్రాలను బాహ్య మూల్యాంకనం చేయాలంటూ పాఠశాల విద్యాశాఖ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. ఈ విధానం విద్యా వ్యవస్థలో గందరగోళానికి దారితీసే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.
కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కనీస కాలపరిమితి వేతన విధానం ప్రకటించాలని, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల వేతనాలను 010 పద్దు కింద చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే వారి సర్వీసులను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.





ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తపస్ నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.కార్యక్రమంలో తపస్ మండల శాఖ అధ్యక్షుడు బైరి సురేష్, ప్రధాన కార్యదర్శి జిట్టవేణి శ్రీను, జిల్లా, మండల బాధ్యులు జి. కుమారస్వామి, డి. రవికిరణ్, వేముల మల్లికార్జున్, అశోక్, సంపత్, రాజేందర్, సంతోష్, లంక శిరీష, స్నేహలత, స్వర్ణ, రేణుకతో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొని సభ్యత్వం స్వీకరించారు.

మంగళవారం - 08 - సెప్టెంబర్ - 2026

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తాతా మధు రాజీనామా చేయాలి

- స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలి
- అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి
- దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు



**ఇల్లంతకుంట, సెప్టెంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు):** శాసనసభ స్పీకర్ వంటి అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత, అసభ్య పదజాలంతో మాట్లాడటాన్ని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు తీవ్రంగా ఖండించారు. స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య వ్యవస్థకు, శాసనసభ గౌరవానికి అవమానకరమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల మధ్య విభేదాలు, విధానాలపై విమర్శలు సహజమేనని, అయితే రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిని వ్యక్తిగతంగా కించపరిచేలా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని స్పీకర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

తాతా మధుపై చర్యలు తీసుకోవాలి

స్పీకర్‌పై చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలపై శాసనసభ నియమావళి ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఇంగిలే రామారావు కోరారు. అంతేకాకుండా తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

దళితులు ఉన్నత విద్యను అభ్యసించి, వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగి అత్యున్నత పదవులను అలంకరిస్తున్నప్పటికీ వారిపై వివక్ష, చిన్నచూపు, అవమానకరమైన వ్యవహారశైలి కొనసాగడం దురదృష్టకరమన్నారు. రాజ్యాంగ పదవులకు, వ్యక్తుల సామాజిక నేపథ్యానికి అతీతంగా ప్రతి ఒక్కరూ గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు.

నాయకత్వం స్పందించాలి

నిన్న జరిగిన సమావేశంలో శాసనసభాపతిని అవమానించేలా మాట్లాడేందుకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ప్రోత్సహించారా అని ఇంగిలే రామారావు ప్రశ్నించారు. ఈ అంశంపై బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కేసీఆర్ స్పష్టంగా స్పందించాలని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యలను శాసనసభలో ప్రస్తావించి, వాటిపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు చిత్తశుద్ధి లేదని ఆయన విమర్శించారు. నిరసనలు, వ్యక్తిగత విమర్శలకు బదులుగా ప్రజా సమస్యలపై సభలో నిర్మాణాత్మకంగా చర్చించాలని సూచించారు.

ఎమ్మెల్సీ తాతా మధు వెంటనే రాజీనామా చేసి, స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఇంగిలే రామారావు డిమాండ్ చేశారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ ఆగ్రహం

- ఎమ్మెల్సీ తాతా మధుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ తీరుపై మండిపడ్డ కాంగ్రెస్ నాయకులు



**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 07 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరుపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ప్రాంగణంలో పోలీసులతో వాగ్వాదానికి దిగడం, నిరసనల పేరుతో నినాదాలు చేయడం, స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు.

ఈ సందర్భంగా జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దొగ్గల భాస్కర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉండగా, పోలీసులతో దురుసుగా ప్రవర్తించడం, అసెంబ్లీ గేటు వద్ద నిరసనల పేరుతో ఉద్రిక్తతకు దారితీసే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులు ధరించి వాటిపై ప్రభుత్వ హామీలపై నినాదాలు ముద్రించుకొని అసెంబ్లీ వద్ద నిరసనలకు దిగడం వల్ల హైదరాబాద్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. అసెంబ్లీలో రాష్ట్రానికి సంబంధించిన ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ప్రతిపక్షం, సభ వెలుపల నిరసనలకే పరిమితం కావడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు.

ముఖ్యంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు చెబుతున్న అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఒక దళితుడు రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఉన్నత పదవిలో కొనసాగుతున్న సమయంలో ఆయనపై ఈ విధంగా మాట్లాడటం సరికాదని దొగ్గల భాస్కర్ అన్నారు. తాతా మధుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, అవసరమైన చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మధుపై చర్యలు తీసుకోవాలి

ఫిషర్‌మెన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పింగిళి రాకేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధుపై బీఆర్ఎస్ పార్టీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు, స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని కోరారు.

దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి శాసనసభ స్పీకర్‌గా ఉన్నత పదవిలో ఉండటాన్ని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. స్పీకర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై శాసనసభలో నిర్మాణాత్మకంగా చర్చించాల్సిన ప్రజాప్రతినిధులు సభ వెలుపల వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం, ఆందోళనలకు దిగడం సరికాదన్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు, శాసనసభ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యేల అరెస్టుపై బీఆర్ఎస్ భగ్గుమంది





- జమ్మికుంటలో మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో మానవహారం, ధర్నా
- అరెస్టు చేసిన ఎమ్మెల్యేలను విడుదల చేయాలని డిమాండ్

**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 07 (తెలంగాణ ముచ్చట్లు):** అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ జమ్మికుంటలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఆధ్వర్యంలో మానవహారం, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలను ప్రస్తావించేందుకు బీఆర్ఎస్ శాసనసభా పక్ష సమావేశంలో చర్చించిన అంశాల ఆధారంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభకు వెళ్తున్న సమయంలో అరెస్టులు చోటుచేసుకున్నాయని తెలిపారు. కేటీఆర్, హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని ఆయన ఖండించారు. ప్రతిపక్షంగా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం తమ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ కొనసాగిస్తున్న పోరాటాన్ని అరెస్టులతో అడ్డుకోలేరని అన్నారు. అదుపులోకి తీసుకున్న ఎమ్మెల్యేలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తే ప్రజా సమస్యలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలపై రాజకీయ పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై చర్చకు అవకాశం కల్పించాలని కోరారు. కౌశిక్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అరెస్టులపై తమ నిరసనను వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగళి రమేష్, మాజీ ఎంపీపీ దొడ్డే మమత, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# అరెస్టులపై భగ్గుమన్న బీఆర్ఎస్

- వీణవంకలో రోడ్డెక్కిన గులాబీ శ్రేణులు
- ఎమ్మెల్యేల అరెస్టు ప్రజాస్వామ్యానికి విరుద్ధం బీఆర్ఎస్ నాయకులు

**వీణవంక, సెప్టెంబర్ 07 (తెలంగాణ ముచ్చట్లు):** అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేయడంపై ఆ పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎమ్మెల్యేల అరెస్టులను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వీణవంక మండల కేంద్రంలో జమ్మికుంట-కరీంనగర్ ప్రధాన రహదారిపై భారీ ధర్నా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వెళ్తున్న ప్రజాప్రతినిధులను అడ్డుకొని అరెస్టు చేయడం దారుణమని మండిపడ్డారు. ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య విలువలను అవమానించేలా ఉందని ఆరోపించారు.

ప్రజల తరపున ప్రశ్నించే గొంతులను అరెస్టులతో అణచివేయాలని చూడటం సరికాదని, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే హక్కు ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకు ఉందని అన్నారు. ఎమ్మెల్యేల అరెస్టులను వెంటనే ఖండిస్తూ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

ధర్నా సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో వీణవంకలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించడంతో కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

# మట్టి గణపతితో పర్యావరణ పరిరక్షణకు పిలుపు

- ఘనంగా విఘ్నేశ్వరుని ఆగమన వేడుకలు



**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు):** వినాయక చవితి ఉత్సవాలకు జమ్మికుంట పట్టణం సిద్ధమవుతోంది. పట్టణ పరిధిలోని మేదరివాడలో శ్రీ విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన విఘ్నేశ్వరుని ఆగమన వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మేదరివాడ శ్రీ విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ మట్టి గణపతిని తీసుకురావడం అభినందనీయమన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టి గణపతిని ప్రతిష్ఠించడం ద్వారా జమ్మికుంట పట్టణ ప్రజలకు కమిటీ మంచి సందేశాన్ని అందించిందని పేర్కొన్నారు.

పట్టణ ప్రజలందరూ తమ తమ మండపాల్లో గణనాథుడిని ప్రతిష్ఠించి నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని కోరారు. గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాలని సూచించారు. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ఉత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ హితంగా సాగాలని ఆకాంక్షించారు. గణనాథుని ఆశీస్సులు జమ్మికుంట పట్టణ ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు చింతల శ్రీనివాస్, కొలుగూరి సురేష్, కూతాడి తిరుపతి, శ్రీకాంత్, శ్రీ విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ సభ్యులు వినయ్, సాయి, నరేందర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టు సాగు పునరుజ్జీవనానికి వేలైర్ రైతుల ముందడుగు

- ఎంఆర్ఎంఏ 2.0 అవగాహన కార్యక్రమానికి విశేష స్పందన
- కమ్మరిపేటలో 30 మంది రైతులు పట్టు సాగుకు ఆసక్తి






**హనుమకొండ, సెప్టెంబర్ 7 (తెలంగాణ ముచ్చట్లు):** సంప్రదాయ పట్టు సాగుకు పేరుగాంచిన వేలైర్ ప్రాంతంలో పట్టు పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకురావాలనే లక్ష్యంతో నిర్వహించిన 'మేరా రేశం-మేరా అభిమాన్ (ఎంఆర్ఎంఏ) 2.0' కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. సోమవారం కమ్మరిపేట గ్రామంలో సర్పంచ్ జోడుముంతల కిరణ్ ఆధ్వర్యంలో అవగాహన, ప్రోత్సాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర పట్టు మండలి, తెలంగాణ రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వేలైర్ ప్రాంతానికి చెందిన సుమారు 100 మంది రైతులు, మహిళా రైతులు, యువత, ప్రగతిశీల రైతులు, పట్టు సాగుపై ఆసక్తి ఉన్న నూతన రైతులు హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న వారిలో సుమారు 30 మంది రైతులు పట్టు సాగు చేపట్టేందుకు తమ ఆసక్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టు సాగు ప్రాధాన్యత, ఆధునిక సాగు పద్ధతులు, అధిక దిగుబడికి అనుసరించాల్సిన సాంకేతిక విధానాలు, రైతుల ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, పట్టు పరిశ్రమ ద్వారా లభించే ఉపాధి, పారిశ్రామిక అవకాశాలపై అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. సంప్రదాయ పట్టు సాగు ప్రాంతాల్లో రైతుల్లో తిరిగి ఆసక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందించి, మరింత మందిని పట్టు సాగు వైపు ప్రోత్సహించడమే ఎంఆర్ఎంఏ 2.0 కార్యక్రమం ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా యువత, నూతన రైతులు పట్టు సాగును స్థిరమైన, లాభదాయకమైన జీవనోపాధిగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమాన్ని మైసూరులోని సెంట్రల్ సిల్క్ బోర్డు-సీఎస్ఆర్‌టీఐ శాస్త్రవేత్త డాక్టర్ వజ్రమ్మ సమన్వయం చేశారు. కమ్మరిపేట సర్పంచ్ జోడుముంతల కిరణ్, ఉపసర్పంచ్ చిలుపూరి సూర్యనారాయణ, వార్డు సభ్యులు, జిల్లా నోడల్ అధికారులు సంజీవ్ రెడ్డి, తిరుపతి రెడ్డి, పట్టు పరిశ్రమ శాఖ అధికారి మల్లయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కమ్మరిపేట కార్యక్రమంలో 30 మంది రైతులు పట్టు సాగుకు ముందుకు రావడం వేలైర్ ప్రాంతంలో పట్టు సాగు పునరుజ్జీవనానికి శుభసూచకమని నిర్వాహకులు పేర్కొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక





# వర్షాకాల సమావేశాలపై బీఏసీ సమావేశం

- స్పీకర్ గడ్డం ప్రసాద్ అధ్యక్షతన భేటీ
- సమావేశాల నిర్వహణ, అజెండాపై చర్చ
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా పలువురు సభ్యుల హాజరు

**హైదరాబాద్, సెప్టెంబర్ 07, (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర వర్షాకాల శాసనసభ సమావేశాల నేపథ్యంలో అసెంబ్లీ బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశం సోమవారం శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో నిర్వహించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రానున్న సమావేశాల నిర్వహణ, సభా కార్యక్రమాల రూపకల్పన, చర్చలకు కేటాయించే సమయం వంటి కీలక అంశాలపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. వర్షాకాల సమావేశాలు సజావుగా, ఫలప్రదంగా సాగేందుకు అవసరమైన కార్యాచరణపై సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సభలో ప్రభుత్వ పక్షం ప్రవేశపెట్టనున్న బిల్లులు, ప్రజా సమస్యలకు సంబంధించిన చర్చలు, వివిధ శాఖలకు సంబంధించిన అంశాలను సభలో ప్రస్తావించే విధానం వంటి విషయాలపై బీఏసీ సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రజలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై సభ్యులకు తగిన అవకాశాలు కల్పించే విధంగా సమావేశాల షెడ్యూల్ రూపొందించడంపై దృష్టి సారించారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరై ప్రభుత్వ తరపున పలు అంశాలను ప్రస్తావించారు. శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కూడా సమావేశంలో పాల్గొని సమావేశాల నిర్వహణకు సంబంధించిన ప్రతిపాదనలను వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కూడా సభా కార్యక్రమాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో పాటు సభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, అహ్మద్ బిన్ బలాలా (ఎంఐఎం) సమావేశంలో పాల్గొన్నారు. సభలో ప్రజా సమస్యలపై విస్తృత చర్చ జరిగేలా సమయాన్ని కేటాయించాలని, ప్రతిపక్షాలకు కూడా తగిన అవకాశాలు కల్పించాలని సభ్యులు సూచించినట్లు సమాచారం. శాసనసభ కార్యకలాపాల నిర్వహణలో సమన్వయం అవసరమని సమావేశంలో అభిప్రాయపడ్డారు. అలాగే శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి సమావేశానికి హాజరై సభా కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన పరిపాలనా అంశాలను సభ్యులకు వివరించారు. సమావేశాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, విధివిధానాలు, చర్చల క్రమం, అధికారిక ప్రక్రియలపై ఆయన వివరణ ఇచ్చినట్లు తెలిసింది. సభా కార్యక్రమాలు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగేందుకు అవసరమైన చర్యలపై కూడా చర్చ జరిగింది. రాష్ట్ర రాజకీయ పరిణామాల నేపథ్యంలో జరుగుతున్న ఈ వర్షాకాల సమావేశాలకు ప్రాధాన్యత నెలకొంది. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ అంశాలతో పాటు పలు కీలక విషయాలు సభలో చర్చకు వచ్చే అవకాశం ఉన్నందున బీఏసీ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు వర్షాకాల సమావేశాల కార్యాచరణను ఖరారు చేసి సభ్యులకు తెలియజేయనున్నట్లు సమాచారం.

# రైతాంగానికి మల్లారెడ్డి తీరని లోటు: సీఎం



- సంస్మరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి నివాళి
- రైతు సమస్యలపై నడిచే విజ్ఞాన సర్వస్వమని ప్రశంస
- రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానేత
- మల్లారెడ్డి సేవలకు చిరస్థాయి గుర్తింపు కల్పిస్తామని హామీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 7, (తెలంగాణ ముచ్చట్లు):** ఆరు దశాబ్దాల పాటు రైతులు, రైతు కూలీలు, కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. రవీంద్రభారతిలో నిర్వహించిన అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి జాతీయ స్థాయి వరకు రైతాంగ హక్కుల కోసం నిరంతరం పోరాడిన వ్యక్తిగా మల్లారెడ్డి చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు.

భూమి సారం నుంచి పంటల మార్కెటింగ్ వరకు వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రతి అంశంపై మల్లారెడ్డికి అసాధారణ అవగాహన ఉండేదని ముఖ్యమంత్రి అన్నారు. నీరు, విత్తనం, పెట్టుబడి, గిట్టుబాటు ధర, మార్కెటింగ్ వంటి అంశాలను లోతుగా అధ్యయనం చేసి రైతుల తరపున ఉద్యమాలు నడిపిన నాయకుడని ప్రశంసించారు. వ్యవసాయ సమస్యలపై అంతటి పట్టు కలిగిన వ్యక్తిని కోల్పోవడం రైతాంగానికి తీరని లోటని ఆయన వ్యాఖ్యానించారు. సమాజంలో చాలా మంది వ్యక్తిగత గుర్తింపు కోసం ప్రయత్నిస్తారని, కానీ మల్లారెడ్డి మాత్రం రైతులు, రైతు కూలీల సంక్షేమమే తన జీవిత లక్ష్యంగా పెట్టుకున్నారని సీఎం తెలిపారు. రైతు బతుకును మెరుగుపర్చేందుకు ఆయన చేసిన కృషి తరతరాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. రైతుల సమస్యలపై ఆయన రాసిన పుస్తకాలు, చేసిన సూచనలు ఇప్పటికీ మార్గదర్శకంగా ఉన్నాయని అన్నారు. వామపక్ష ఉద్యమాల ఫలితంగానే కనీస వేతన చట్టం, భూ పంపిణీ, నిరుపేదలకు గృహాలు, ఉపాధి హామీ, ఆహార భద్రత వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలులోకి వచ్చాయని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. రైతులు, కూలీల కోసం సాగిన పోరాటాలకు అనుగుణంగా ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయని వివరించారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు చేపట్టిన చర్యలను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల హక్కుల పరిరక్షణకు సామాజిక ఉద్యమాలు అవసరమని, సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో వామపక్షాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం సాగిన ఉద్యమాలు సమాజ అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. సారంపల్లి మల్లారెడ్డి సేవలను చిరస్థాయిగా నిలిపేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆయన పేరును శాశ్వతంగా గుర్తుంచుకునే విధంగా మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, సీపీఎం నాయకులు ప్రకాశ్ కారత్, జాన్ వెస్లీ, పలువురు ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్-2026 పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్

- నోటీసుల పంపిణీ, విచారణల నిర్వహణపై కీలక ఆదేశాలు
- పెండింగ్ కేసులను సకాలంలో పరిష్కరించాలని సూచన
- రాజకీయ పార్టీలతో సమన్వయం పెంచాలని అధికారులకు ఆదేశం





**హైదరాబాద్, సెప్టెంబర్ 07, (తెలంగాణ ముచ్చట్లు):** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)2026 కార్యక్రమం అమలుపై తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సి. సుధర్శన్ రెడ్డి ఐఏఎస్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి ఐఏఎస్, డిప్యూటీ సీఈవో జి.ఎస్. చారి పాల్గొన్నారు. హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు (డీఈవోలు), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్వోలు) సమావేశంలో పాల్గొని ఎస్ఐఆర్2026 అమలు పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా నోటీసుల పంపిణీ, విచారణల నిర్వహణ, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వంటి అంశాలపై సీఈవో ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి నోటీసును సంబంధిత ఓటరుకు బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) స్వయంగా అందజేయాలని ఆదేశించారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల చిరునామాలను గుర్తించడంలో బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏలు) సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. ఓటర్లకు సమాచారం చేరడంలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలకు అదనంగా కేటాయించిన లాగిన్ సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించి పెండింగ్‌లో ఉన్న కేసులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సీఈవో ఆదేశించారు. అన్‌మ్యాపింగ్, అనామలీస్ కేసులకు సంబంధించిన జాబితాలను రాజకీయ పార్టీల సమావేశాల్లో వారికి అందుబాటులో ఉంచాలని సూచించారు. క్లెయిమ్స్, అభ్యంతరాల పరిశీలన కాలంలో బీఎల్ఏలు చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించాలని అధికారులకు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు పత్రాలను సక్రమంగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కంప్యూటర్ ఆపరేటర్లు చేసే పొరపాట్లకు సంబంధిత ఈఆర్వోలు, ఏఈఆర్వోలు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. డేటా నమోదు, పత్రాల అప్‌లోడింగ్ ప్రక్రియలో ఖచ్చితత్వం పాటించాలని స్పష్టం చేశారు.

వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించి విచారణ కేంద్రాల పరిధిలోకి రాని ప్రాంతాల్లో సూపర్‌వైజర్లు నేరుగా వారి నివాసాలకు వెళ్లి అవసరమైన సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే ఓటర్లకు అవసరమైన సహాయం అందించేందుకు ఈఆర్వో, డీఈవో స్థాయిలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లను పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అర్హ ఓటరుకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పని చేయాలని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల డీఈవోలతో నోటీసుల పంపిణీ, విచారణల షెడ్యూల్, ఈఆర్వో, డీఈవో లాగిన్‌లలో పెండింగ్ కేసుల పరిష్కార పురోగతిపై సీఈవో సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా పురోగతిని పరిశీలించి అవసరమైన సూచనలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నోడల్ అధికారులు, ప్రాజెక్ట్ మేనేజర్ (ఐటీ)తో పాటు ఇతర ఎన్నికల శాఖ అధికారులు కూడా పాల్గొన్నారు.

# కార్పొరేషన్లలోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం

- గుడిసెలు లేని తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం
- కేంద్రం నుంచి ఇళ్లకు సహకారం లేదన్న మంత్రి
- దసరా నాటికి రెండు లక్షల ఇళ్లు పూర్తి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**హైదరాబాద్, సెప్టెంబర్ 07, (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామీణ ప్రాంతాల్లో పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నట్లుగానే పట్టణ ప్రాంతాల్లో నివసించే నిరుపేదలకు కూడా గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శాసనమండలిలో ఇందిరమ్మ ఇళ్లపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చిన మంత్రి, స్థలాల కొరతను దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ తరహాలోనే నల్గొండ, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ తదితర మున్సిపల్ కార్పొరేషన్లలో కూడా బహుళ అంతస్తుల గృహ సముదాయాలను నిర్మించనున్నట్లు వెల్లడించారు.

రాష్ట్రంలో గుడిసెల్లో నివసిస్తున్న ప్రతి కుటుంబాన్ని గుర్తించి వారికి శాశ్వత గృహ వసతి కల్పించడం ద్వారా గుడిసెలు లేని తెలంగాణను నిర్మించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను అందించడంతో పాటు, ఇళ్ల నిర్మాణం సజావుగా సాగేందుకు మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా లక్ష రూపాయల వరకు ముందస్తు రుణ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సమగ్ర కార్యాచరణతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లభించడం లేదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాలకు లక్షల సంఖ్యలో గ్రామీణ గృహాలను మంజూరు చేసిన కేంద్రం తెలంగాణకు మాత్రం ఇప్పటివరకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి పలుమార్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ ఆశించిన స్పందన రాలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.22,500 కోట్ల వ్యయంతో అనుమతులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. ఇందులో 3,75,750 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయగా, 3,28,070 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 1,97,537 ఇళ్లు పూర్తయ్యాయని, రాబోయే దసరా పండుగ నాటికి రెండు లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 2,000 చొప్పున మొత్తం 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు మంజూరు చేసినప్పటికీ వివిధ కారణాలతో నిర్మాణం పూర్తికాని ఇళ్లకు ఈ విడతలో ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఈ నెల 20వ తేదీలోగా రెండో విడత ఇళ్ల మంజూరు ప్రక్రియను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తామని స్పష్టం చేశారు. పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పిస్తోందని మంత్రి తెలిపారు. సిమెంట్ బస్తాను రూ. 230కే అందిస్తున్నామని, త్వరలో ఉక్కును కూడా రాయితీ ధరలకు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రెండు పడకగదుల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తున్నామని, ఆయా కాలనీల్లో అవసరమైన మౌలిక వసతులను కూడా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పేదలకు ఇల్లు అంటే కేవలం నివాసం మాత్రమే కాదని, అది వారి ఆత్మగౌరవానికి ప్రతీక అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ముందడుగు

- ప్రతిపాదిత స్థలాలను పరిశీలించిన సాంకేతిక బృందం
- విమానాశ్రయ ఏర్పాటుపై సాధ్యాసాధ్యాల అధ్యయనం
- భూమి, రన్‌వే, భద్రతా ప్రమాణాలపై క్షేత్రస్థాయి పరిశీలన
- అభివృద్ధికి దోహదం చేస్తుందన్న ప్రజాప్రతినిధులు



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 7, (తెలంగాణ ముచ్చట్లు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ఏర్పాటు దిశగా కీలక ముందడుగు పడింది. విమానాశ్రయ ఏర్పాటుకు గుర్తించిన ప్రతిపాదిత ప్రాంతాల సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు భారత విమానాశ్రయాల సంస్థకు చెందిన బహుళ విభాగాల సాంకేతిక బృందం జిల్లాకు చేరుకుని క్షేత్రస్థాయి అధ్యయనం ప్రారంభించింది. రెండు రోజుల పర్యటనలో భాగంగా బృందం వివిధ ప్రాంతాల్లో భూముల అనుకూలత, భౌగోళిక పరిస్థితులు, మౌలిక వసతుల అవకాశాలను పరిశీలిస్తోంది. భారత్ రెడ్డి నేతృత్వంలోని బృందం సీతంపేట, సుజాతనగర్, దుమ్ముగూడెం, చాపరాలపల్లి, పాల్వంచ, దమ్మపేట, పెనగడప ప్రాంతాలను సందర్శించి భూమి లభ్యత, విస్తీర్ణం, సర్వే హద్దులు, రన్‌వే నిర్మాణానికి అనుకూలత, విమానాల రాకపోకలకు అవసరమైన పరిస్థితులను అధ్యయనం చేసింది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విమానాశ్రయ విస్తరణకు అవకాశాలు ఉన్నాయా అనే అంశాన్ని కూడా పరిశీలించింది.

చిన్న విమానాలతో పాటు పెద్ద ప్రయాణికుల విమానాలు కూడా దిగేలా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై బృందం దృష్టి సారించింది. ఇందుకోసం పొడవైన రన్‌వే నిర్మాణానికి అవసరమైన భూమి, భౌగోళిక పరిస్థితులు, భద్రతా ప్రమాణాలు, రాత్రి వేళల్లో విమానాల రాకపోకలకు అవసరమైన సదుపాయాలపై సాంకేతిక అధ్యయనం కొనసాగుతోంది. విమానాశ్రయం భవిష్యత్ అభివృద్ధికి అవసరమైన అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలిస్తున్నారు. ప్రతిపాదిత ప్రాంతాల సమీపంలో ఉన్న విద్యుదీకరించిన బొగ్గు రవాణా రైల్వే మార్గం విమానాశ్రయ కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశాన్ని కూడా బృందం పరిశీలిస్తోంది. అవసరమైతే సాంకేతిక పరిష్కారాల ద్వారా అవరోధాలను అధిగమించే అవకాశాలను అధ్యయనం చేయడంతో పాటు సంబంధిత శాఖల అనుమతుల అంశాన్ని కూడా పరిశీలించనుంది. ఈ సందర్భంగా సింగరేణి అతిథి గృహంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురామిరెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో సాంకేతిక బృందం సమావేశమైంది. విమానాశ్రయ నిర్మాణం ద్వారా పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయి పరిశీలనకు అవసరమైన భూ రికార్డులు, సర్వే వివరాలు, రెవెన్యూ మ్యాపులు, రహదారి అనుసంధానాలు, సాంకేతిక సమాచారాన్ని జిల్లా యంత్రాంగం బృందానికి అందుబాటులో ఉంచింది. రెండు రోజుల పరిశీలన అనంతరం సమగ్ర సాంకేతిక నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించిన తదుపరి నిర్ణయాలు ఆ నివేదిక ఆధారంగానే తీసుకోనున్నారు.

# బంగారం ధరలకు భారీ తగ్గుదల

**హైదరాబాద్, సెప్టెంబరు 7 (తెలంగాణ ముచ్చట్లు):** బంగారం కొనుగోలు చేయాలని ఎదురుచూస్తున్న వారికి సోమవారం కొంత ఊరట లభించింది. దేశీయ మార్కెట్‌లో పసిడి ధరలు తగ్గుముఖం పట్టాయి. పది గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై రూ.650, 22 క్యారెట్ల బంగారంపై రూ.600, 18 క్యారెట్ల బంగారంపై రూ.490 మేర తగ్గింది. మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా పసిడి ధరల్లో ఈ తగ్గుదల నమోదైంది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం సోమవారం ఉదయం 11 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,54,150గా నమోదైంది. అదే సమయంలో పది గ్రాముల 22 క్యారెట్ల బంగారం రూ.1,41,300 వద్ద, 18 క్యారెట్ల బంగారం రూ.1,15,610 వద్ద కొనసాగుతోంది.తెలంగాణలోని ఇతర ప్రధాన పట్టణాల్లోనూ బంగారం ధరలు దాదాపు హైదరాబాద్ మార్కెట్ ధరలతోనే కొనసాగుతున్నాయి. వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ ప్రాంతాల్లో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1,54,150గా, 22 క్యారెట్ల బంగారం రూ.1,41,300గా, 18 క్యారెట్ల బంగారం రూ.1,15,610గా నమోదైంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## ఈ నెల 10 న "చలో హైదరాబాద్ - ఉద్యోగుల మహాధర్నా" ను విజయవంతం చేయాలి




- **మెడికల్ ఫోరం యూనిట్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ...**

**స్టేషన్ ఘనపూర్,సెప్టెంబర్7(తెలంగాణ ముచ్చట్లు):** ఉద్యోగుల న్యాయమైన హక్కుల కోసం ఈ నెల 10 న హైదరాబాద్ లో నిర్వహించనున్న "చలో హైదరాబాద్ ఉద్యోగుల మహాధర్నా" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్టేషన్ ఘనపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ ఫోరం యూనిట్ అధ్యక్షులు వడ్లకొండ రమేష్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఉద్యోగులకు రావాల్సిన డీఏ బకాయిల విడుదల, పీఆర్సీ అమలు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం, సిపిఎస్ రద్దు చేసి ఓ పి ఎస్ పునరుద్ధరించాలి అనేటువంటి సమస్యల పరిష్కారం,న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉద్యుగుల హక్కుల కోసం చేపట్టిన మహాధర్నాలో ఉద్యోగులు ఐక్యంగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల ఐక్యతే బలం, హక్కుల సాధనే లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమెన్స్ ఫోరం అధ్యక్షులు యశోద, పర్వీన్ సుల్తానా, రాజేష్, నర్సింగ్ ఆఫీసర్లు, మెడికల్ ఫోరం ప్రతినిధులు, ఆస్పత్రి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు...

# సభను అడ్డుకోవడానికే బీఆర్ఎస్ వ్యవహరించింది: జూపల్లి

- **బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల తీరుపై మంత్రి విమర్శలు**
- **సభాపతిపై వ్యాఖ్యలు చేయడం ఖండనీయం అన్న జూపల్లి**
- **తాతా మధుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**
- **అసెంబ్లీ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిదని వ్యాఖ్య**



**హైదరాబాద్, సెప్టెంబర్ 7, (తెలంగాణ ముచ్చట్లు):** అసెంబ్లీ సమావేశాలను అడ్డుకోవాలనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించారని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. సభా కార్యక్రమాలను సజావుగా సాగనివ్వకుండా ఉద్దేశపూర్వకంగా ఉద్రిక్త పరిస్థితులు సృష్టించేందుకు ప్రయత్నించారని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉంటుందని పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ సభ్యులు వ్యవహరించిన తీరును మంత్రి తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సమయంలో సభను అడ్డుకునే విధంగా ప్రవర్తించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం చట్టసభలను ఆశ్రయిస్తారని, అలాంటి వేదికలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం మంచిది కాదని వ్యాఖ్యానించారు.

శాసనమండలి సభ్యుడు తాతా మధు సభాపతిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. చట్టసభల అత్యున్నత స్థానాల్లో ఉన్న వ్యక్తుల పట్ల గౌరవం పాటించడం ప్రతి సభ్యుడి బాధ్యత అని చెప్పారు. వ్యక్తిగత ఆవేశాలు, రాజకీయ భేదాభిప్రాయాల కారణంగా సభాపతి పదవిని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సమర్థించలేమన్నారు. బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకే ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయని మంత్రి ఆరోపించారు. సభలో గందరగోళం సృష్టించేందుకు ముందుగానే ప్రణాళిక రచించినట్లు కనిపిస్తోందని అన్నారు. ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరించే చర్యలను ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు.

గతంలో ఎలాంటి తప్పు చేయకపోయినా కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ సభ్యులను అసెంబ్లీ నుంచి బహిష్కరించిన ఘటనలను కూడా జూపల్లి ప్రస్తావించారు. ఇప్పుడు అదే పార్టీ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం ఆశ్చర్యకరమని విమర్శించారు. రాజకీయాల్లో పరస్పర గౌరవం, సంయమనం అవసరమని పేర్కొన్నారు. సభాపతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధుపై తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి డిమాండ్ చేశారు. చట్టసభల గౌరవాన్ని దెబ్బతీసే చర్యలపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు సభ్యులందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జూపల్లి కృష్ణారావు సూచించారు.



## యోగా సాధనతో ప్రశాంతతత, శాంతి పొందుతారు

- **జిల్లా స్థాయి యోగ ఎంపిక పోటీలలో**
- **యోగ అసోసియేషన్ రాష్ట్ర పరిశీలకులు బొలిశెట్టి కమలాకర్**

**స్టేషన్ ఘనపూర్,సెప్టెంబర్7(తెలంగాణ ముచ్చట్లు):** డివిజన్ కేంద్రంలోని మా గార్డెన్ లో జనగామ జిల్లా యోగ అసోసియేషన్ అధ్యక్షులు అన్నెపు రాజేంద్రన్ ఆధ్వర్యంలో వివిధ ఏజ్ గ్రూపులలో యోగా పోటీలను నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి దాదాపు 180 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి వారిని ఈనెల 12 , 13వ తేదీ కరీంనగర్ లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి యోగ అసోసియేషన్ రాష్ట్ర పరిశీలకులు బొలిశెట్టి కమలాకర్ హాజరై యోగ పోటీలను ప్రారంభించారు. యోగ సాధనతో స్థిరచిత్తం ప్రశాంతత శాంతి పొందుతాతమన్నారు. మనసు శరీరాన్ని సంధానం చేసి సమన్వయ పరుస్తుందని, వివిధ జబ్బులు భోగాల బారిన పడకుండా యోగ కాపాడుతుందన్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పడిన కమిటీ ని కమలాకర్ పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడవ వార్డు కౌన్సిలర్ తో సుమలత కుమార్, 9వ వార్డు కౌన్సిలర్ సోదర పెల్లి సంపత్ రాజ్, హనుమకొండ జిల్లా యోగా అసోసియేషన్ భాగ్యలు బాల్నేని శ్రీధర్, జనగామ జిల్లా నూతన కమిటీ అధ్యక్షులు రాజేంద్ర, కార్యదర్శి సుధాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ లు కొంచెం కుమార్, తాళ్లపల్లి సంజన, కిషన్ నాయక్ కిరణ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ లు ఆకుల సాయికుమార్ ,దేవ్ సింగ్, శ్రీధర్ ఉమాదేవి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనకు నిరసనగా మహబూబ్‌నగర్‌లో భారీ రాస్తారోకో



- **బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టులను ఖండించిన మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్**
- **ప్రజా సమస్యలపై మాట్లాడకుండా ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపణ**

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7, (తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపిస్తూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు భారీ రాస్తారోకో నిర్వహించారు. అసెంబ్లీ సమావేశాలకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడం, అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన వి. శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను చర్చించకుండా ప్రతిపక్ష గొంతును నొక్కివేస్తోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నించేందుకు, అసెంబ్లీలో ప్రజల తరపున మాట్లాడేందుకు వెళ్తున్న ప్రజాప్రతినిధులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను బయటపెట్టకుండా అడ్డుకునేందుకు అధికార యంత్రాంగాన్ని ఉపయోగిస్తున్నారని ఆరోపించారు.

మహిళా ఎమ్మెల్యేలు అని కూడా చూడకుండా పోలీసులు వ్యవహరించారని, వారిని బలవంతంగా ఈడ్చుకుంటూ వెళ్లడం, చీరలు లాగడం, గొంతులు పట్టుకోవడం వంటి చర్యలు అత్యంత దుర్మార్గమని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. ఈ ఘటనల్లో పలువురు ప్రజాప్రతినిధులకు గాయాలయ్యాయని, వారితో అవమానకరంగా ప్రవర్తించారని ఆరోపించారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ఈ విధమైన వ్యవహారం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, పింఛన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఉందని ఆయన అన్నారు. ఈ అంశాలపై అసెంబ్లీలో చర్చ జరగకుండా బీఆర్ఎస్ సభ్యులను అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం తన వైఫల్యాలను దాచిపెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించే హక్కును కాలరాస్తున్నారని ఆరోపించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రతిపక్షం పోరాడుతుంటే ప్రభుత్వం నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వాటిని ప్రస్తావించే వారిపైనే కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి ఉన్న హక్కులను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చకు అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజల గొంతుకగా నిలిచే తమ ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, ప్రజల తరఫున తమ పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ప్రజా ఉద్యమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

## గణేష్ మండపాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

- **ధర్మసాగర్ ఎస్‌హెచ్‌ఓ సూచన**



**ధర్మసాగర్,సెప్టెంబర్8(తెలంగాణ ముచ్చట్లు):** గణేష్ ఉత్సవాల సందర్భంగా ధర్మసాగర్ మండల పరిధిలో మండపాలు ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు తమ మండపాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సూచించారు.

మండపాల నిర్వాహకులు తెలంగాణ పోలీస్ అధికారిక వెబ్‌సైట్ policeportal.tspolice.gov.in ద్వారా మండప వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఉత్సవాల నిర్వహణలో భాగంగా పోలీస్ శాఖ సూచించిన భద్రతా నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలను నిర్వాహకులు, భక్తులు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

గణేష్ ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్‌హెచ్‌ఓ విజ్ఞప్తి చేశారు. మండపాల ఏర్పాటుకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా సహాయం అవసరమైతే ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ 8712685010 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# ప్రతి రైతు కుటుంబానికి స్థిర ఆదాయం లక్ష్యం

- **కరువు నివారణ ప్రణాళికలపై కలెక్టర్ ప్రియాంక సమీక్ష**
- **రైతులకు సమగ్ర ఆదాయ వనరుల కల్పనపై దృష్టి**
- **పశుసంవర్ధక, పౌల్ట్రీ, డెయిరీ రంగాల అనుసంధానానికి సూచనలు**
- **గ్రామ స్థాయిలో సమగ్ర అభివృద్ధి కార్యాచరణకు ఆదేశాలు**

**నారాయణపేట, సెప్టెంబర్ 7, (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రైతు కుటుంబానికి ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరేలా, స్థిరమైన ఆదాయ వనరులను కల్పించే సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో కరువు నివారణ కార్యక్రమంపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో అమలు చేస్తున్న కరువు నివారణ కార్యక్రమంలో భాగంగా ఉట్కూర్ మండలాన్ని ఎంపిక చేయగా, అమలు బాధ్యతలు నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు కార్యాచరణ ప్రణాళికను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు కుటుంబాల అవసరాలు, స్థానిక వనరులు, రైతుల సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకుని ఒకే సమగ్ర ప్రణాళిక కింద అన్ని కార్యక్రమాలను అనుసంధానం చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న నిధులను చిన్న చిన్న కార్యక్రమాలుగా విభజించకుండా, ఎక్కువ మంది రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా ప్రధాన ప్రణాళికలను రూపొందించాలని తెలిపారు. ప్రతి గ్రామం అభివృద్ధి కేంద్రంగా మారే విధంగా కార్యాచరణ ఉండాలని పేర్కొన్నారు. వ్యవసాయంతో పాటు పశుసంవర్ధక, కోళ్ల పెంపకం, పాల ఉత్పత్తి, గొర్రెలు, మేకల పెంపకం వంటి జీవనాధార రంగాలను ప్రణాళికల్లో భాగం చేయాలని కలెక్టర్ సూచించారు. రైతులకు అవసరమైన శిక్షణ, సాంకేతిక సహాయం, పశువైద్య సేవలు, మార్కెట్ అవకాశాలు కల్పించే విధంగా సమగ్ర వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు. గ్రామీణ కుటుంబాల ఆదాయం పెరగాలంటే వ్యవసాయేతర రంగాలకూ ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

ఉత్పత్తి నుంచి విక్రయాల వరకు మొత్తం ప్రక్రియను అనుసంధానం చేస్తూ విలువ ఆధారిత వ్యవస్థను అభివృద్ధి చేయాలని కలెక్టర్ తెలిపారు. ముడి సరుకుల సరఫరా, ఉత్పత్తి, సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి అన్ని అంశాలు సమన్వయంతో పనిచేసేలా చూడాలని సూచించారు. గ్రామ పంచాయతీలను కేవలం సహజ వనరుల నిర్వహణకే పరిమితం చేయకుండా కుటుంబాల ఆర్థికాభివృద్ధికి కేంద్రాలుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి వారి అవసరాలు, సామర్థ్యాలకు అనుగుణంగా తగిన ఉపాధి అవకాశాలను గుర్తించి ఆర్థిక సంస్థలు, ప్రభుత్వ శాఖలు, మార్కెట్ సంస్థల సహకారంతో అమలు చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఉన్న రైతు ఉత్పత్తిదారుల సంఘాలను మరింత బలోపేతం చేయాలని, అవసరమైతే మాత్రమే కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్, సాంకేతిక సహాయం వంటి అంశాల్లో రైతు సంఘాలకు మద్దతు అందించాలని తెలిపారు. "ఒక గ్రామం – ఒక సమగ్ర ప్రణాళిక – ప్రతి కుటుంబానికి ప్రయోజనం – స్థిరమైన ఆదాయం" అనే లక్ష్యంతో కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. ప్రతి ప్రణాళిక ఆర్థికంగా సాధ్యమైనది, దీర్ఘకాలికంగా నిలకడైనది, కుటుంబాలకు స్థిరమైన ఆదాయం అందించే విధంగా ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియా నాయక్, ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, మత్స్యశాఖ అధికారి రెహమాన్, సంబంధిత సంస్థ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in